

గాయపడిన బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని లోతేరు పంచాయతీ సిరసగుడ గ్రామానికీ చెందిన రాందాస్ ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయాలపాలై అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మండల నాయకులు కె.మగ్గన్న సోమవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. సిరసగూడ గ్రామ సమీపంలో ఆదివారం మేకలు కాస్తుండగా వెనుక నుంచి వచ్చిన రెండు ఎలుగుబంటిలు దాడి చేశాయని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు స్పందించి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పరామర్శిస్తున్న నాయకులు

వ్యాధులతో మూగజీవాలు విలవిల

ప్రజాశక్తి -పాడేరు:జిల్లా కేంద్రం పాడేరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న లగిసపల్లి పంచాయతీ గ్రామాల్లో వ్యాధులతో పశువులు విలవిల్లాడుతున్నాయి. జబ్బువాపు, గాలికుంటు, డెక్కవాపు వంటి వ్యాధుల బారినపడి పశువులు శాలల్లో కదలలేక గత రెండు మూడు రోజులుగా పడి ఉన్నాయని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్యాధికారులు తమ గ్రామాలను సందర్శించి పశువ్యాధులను నిర్ధారించి చికిత్సలు అందించాలని గిరిజన రైతులు కోరుతున్నారు. వ్యాధులతో విలవిల లాడుతున్న పశువుల దుస్థితిపై గ్రామాల్లోని పలువురు రైతులు సోమవారం స్థానిక విలేకరుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గ్రామాన్ని సందర్శించి రైతులను ఆరా తీయగా ఈ పంచాయతీలోని సంపెంగ గరువు, చావిడి మామిడి, పార్వతీపురం కాలనీ, గురుపల్లి, లగిసపల్లి గ్రామాల పరిధిలో చాలా పశువులు వ్యాధుల బారిన పడి ఉన్నాయి. పంచాయతీ, సచివాలయం, యంత్రాంగానికి పశువుల దుస్థితిపై సమాచారం ఇచ్చామని, ఎటువంటి చర్యలు కాన రాలేదని రైతులు చెప్పారు. తమ ప్రాంతానికి సంబంధించిన వెటర్నరీ సిబ్బంది దృష్టికి కూడా సమాచారం ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసే వెటర్నరీ సిబ్బంది వేరేచోట విధులు చేపడుతున్నట్లు తమకు సమాచారం ఇచ్చారని వారు తెలిపారు.

లగిసపల్లి గ్రామానికి చెందిన లకే మోహనకృష్ణ పాత్రుడు మాట్లాడుతూ, ఇటీవల తమ గ్రామానికి చెందిన లకే లక్ష్మీపాత్రుడు, పి.మహేశ్వరరావులకు చెందిన మూడు పశువులు వ్యాధులు సోకి మృత్యువాత పడ్డాయని తెలిపారు. ప్రస్తుతం వర్షాల కారణంగా పశువులకు వ్యాధులు ముసురుకుంటున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి తమ గ్రామాన్ని సందర్శించి వ్యాధులతో ఉన్న పశువులకు వాక్సినేషన్ తోపాటు అవసరమైన వైద్య సేవలను అందించాలని కోరారు. పశువులు మేతకు కూడా వెళ్లలేదని కదల్లేని పరిస్థితిలో ఉంటున్నాయని, లేచి నిలబడి సత్తువ లేనట్లు నేలపై పరుండి పోతున్నాయని తెలిపారు. పశువులు మృతి చెందడంతో రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే ఈ పరిస్థితిని గుర్తించి అవసరమైన చికిత్సలు అందించాలని కోరారు.రైతులకు ఆర్థిక సాయం అందించాలని కోరారు.



లేవ లేని స్థితిలో ఉన్న పశువులు

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-రంపచోడవరం,: వచ్చేనెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. .సోమవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కాలేజీలో అసెంబ్లీకి, పార్లమెంటుకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్ల పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయసునీత మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే అధికారులకు సిబ్బందికి అసెంబ్లీకి, పార్లమెంటుకు ఓట్లు లెక్కింపునకు సంబంధించిన కేంద్రాలలో మౌలిక సదుపాయాలు పక్కగా కల్పించాలన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు స్ట్రాంగ్ రూమ్ దగ్గరకు ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల వద్ద రౌండ్‌దిక్లాక్ మూడంచెల పటిష్ట భద్రత, సిసి కెమెరాల నిఘా పర్యవేక్షణపై ఆరా తీశారు.. అనంతరం సిఆర్‌పిఎఫ్ భద్రత సిబ్బంది వద్ద ఉన్న విజిట్ బుక్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. కార్యక్రమంలో రంపచోడవరం రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, తహాశీల్దార్లు ఎవి.రమణ, నాగరాజు, కృష్ణ జ్యోతి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ పోతంగి పంచాయితీ సంతవలస గ్రామస్తులు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీ బిందెలతో నిరసన ఆందోళన చేపట్టారు. గ్రావిటీ పథకాన్ని పునరుద్ధరించి తక్షణమే తగునీటి సౌకర్యం కల్పించాలని పెద్ద ఎత్తున మహిళలు, గ్రామస్తులు నినాదాలు చేశారు. గ్రామంలో నిర్మించిన గ్రావిటీ పథకం గత కొద్ది రోజులుగా మరమ్మతుకు తాగునీటి సరఫరా కాకపోవడంతో మంచినీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో తాగునీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. గత్యంతరం లేక గెడ్డల్లోని ఊట నీటిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ నీటిని తాగేందుకు అవస్థలు పడుతున్నామన్నారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయంలో ఆందోళన చేపడుతున్న గిరిజన మహిళలు

గిరిజన సంక్షేమ గురుకుల కాలేజీల్లో
22న ఇంటర్ ప్రవేశానికి కౌన్సిలింగ్

ప్రజాశక్తి -రంపచోడవరం : 2024-25 విద్యాసంవత్సరానికి గాను అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం,చింతూరు డివిజన్లలోని చెరో నాలుగు బాలురు, బాలికలు మొత్తంగా ఎనిమిది గురుకుల కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ సీట్ల భర్తీకి ఈ నెల 22న బుధవారం ఉదయం 9 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు సాధించిన మార్కుల ప్రతిభ ఆధారంగా ప్రవేశాలకు ఎంపిక ఉంటుందన్నారు. రంపచోడవరంలోని ఎపి గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, రంపచోడవరం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలుగా నిర్వహించే అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినీవిద్యార్థులు ఆన్‌లైన్‌లోని ఎస్ఎస్‌సి మార్కుల జాబితా, ఒరిజినల్ టెన్త్ టిసి, స్టడీ సర్టిఫికేట్, కులధ్రువీకరణ, రేషన్, ఆధార్‌కార్డులు, బ్యాంకు పాస్‌బుక్‌తోపాటు ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటలు, అన్ని సర్టిఫికెట్లకు సంబంధించి మూడు సెట్ల జిరాక్స్‌లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కన్వీనర్ ప్రిన్సిపల్ జి.ప్రసూన తెలిపారు. పూర్తి వివరాలకు 94909 57243 మొబైల్ నెంబరులో సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మస్తాన్ వలీ

ప్రజాశక్తి -సీలేరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి సూచించారు. సోమవారం జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ చింతపల్లి క్యాంపులో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 56 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఒకరికి మలేరియా నిర్ధారణ అయింది. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతోపాటు ఎండావానలతో కూడిన విపరీత వాతావరణ పరిస్థితులు వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు తగుజాగ్రత్తల పాటించాలని సూచించారు. గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు, ఎం. దేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న పిఒ

స్ట్రాంగ్ రూమును తనిఖీ చేసిన జెసి, పిఒ

ప్రజాశక్తి- పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సోమవారం తనిఖీ చేసారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గంకు సంబంధించి ఇవిఎంలను భద్రపరిచిన గదులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమరాలు సక్రమంగా నిరంతరం పని చేసేలా చూడాలని ఆదేశించారు. గదులకు వేసిన సీళ్లను పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇతరులు డిగ్రీ కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నియంత్రించాలని ఆదేశించారు. అనంతరం లాగ్ బుక్ లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జెసి భావన వశిష్ఠ్ సోమవారం తనిఖీ చేసారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం, ఇవిఎంలను భద్రపరిచిన గదులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమరాలు సక్రమంగా నిరంతరం పని చేసేలా చూడాలని ఆదేశించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం లాగ్ బుక్ లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిరమయ్య ఆశయాలను కొనసాగిద్దాం

- చిన్నమట్టపల్లిలో కారం శిరమయ్య తృతీయ వర్ధంతి సభలో నాయకుల పిలుపు



శిరమయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి-విఆర్ పురం: కామ్రేడ్ కారం శిరమయ్య ఆశయ సాధనకు రానున్న కాలంలో ఉవ్వెత్తున ఉద్యమాలను నిర్వహించాలని సిపిఎం విఆర్ పురం మండల కమిటీ పిలుపు నిచ్చింది.. సోమవారం మాజీ ఎంపిపికారం శిరమయ్య మూడవ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన చిన్నమట్టపల్లిలో నిర్వహించారు. ఈసందర్భంగా శిరమయ్య చిత్ర పటానికి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం చిన్నమట్టపల్లి ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ, అరాచక శక్తులు పార్టీ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసే క్రమంలో అమరజీవులు కామ్రేడ్ బత్తుల భీష్మారావు, బండారు చంద్రరావు, బొప్పెన భీమయ్య, పులి రామయ్య, శ్యామల వెంకటరెడ్డి వంటి ఎందరో ప్రజల కోసం, ప్రజా ఉద్యమాలలో నేలకొరిగి అమరులైన నేపథ్యంలో అటువంటి వారసత్వాన్ని, ఆశయాలను పుణికిపుచ్చుకొని మాజీ ఎమ్మెల్యేలు సున్నం రాజయ్య, కుంజా బొజ్జి నాయకత్వాన కారం శిరమయ్య ఎత్తిన జెండా దించకుండా కడవరకు పార్టీ ఆశయం, సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణతో మండలంలో ప్రజాతంత్ర పోరాటాలలో నిలబడి పనిచేశారన్నారు. ఆయన చూపిన బాటలో కార్యకర్తలు, శ్రేణులు నడుస్తూ, ప్రజాసమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేసిన నాడే అలాంటి అమరజీవులకు ఘననివాళి ర్పించినట్లని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, శ్రీరామగిరి. రామవరం. రేఖపల్లి సర్పంచులు పులి సంతోష్ కుమార్, కారం బుచ్చమ్మ, పూనెం సరోజినీ, మాజీ ఎంపిపి సున్నం. నాగమ్మ ఎంపిటిసి పూనెం. ప్రదీప్ కుమార్, మండల నాయకులు కుంజా నాగిరెడ్డి, వర్లది రమేష్, గుండెపూడి లక్ష్మణరావు, తాతబాబు, రెడ్డి సోడి మల్లయ్య, సున్నం రంగమ్మ, కారం శిరమయ్య సతీమణి, సున్నం రాజయ్య సతీమణి చుక్కమ్మ, పులి బొజ్జి, తొడం రాజు, నాళ్లారపు ప్రకాశరావు, కారం కృష్ణమూర్తి, సున్నం దూలయ్య,పండా వెంకటేశ్వర్లు, వీర్ల నాగేశ్వరరావు, కారం. సారయ్య, ఆసు లక్ష్మయ్య, సారయ్య రాజేశ్వరి, కనకలక్ష్మి పాల్గొన్నారు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు




కూనవరంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్

ప్రజాశక్తి -సీలేరు: వచ్చేనెల 4న ఓట్ల లెక్కింపు సమయంలో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని జీకే వీధి సిఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి హెచ్చరించారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఎక్కడ ఎటువంటి హింసాత్మక చర్యలకు వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కార్యకర్తలు పాల్పడకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు ముందస్తుగానే చేపట్టామన్నారు. ఎన్నికల కోడ్‌తోపాటు 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. నలుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది ఒకేచోట గుమిగూడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాల విడుదల తర్వాత ఎటువంటి కవ్వింపు చర్యలు, విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా పేలుళ్లకు ఎటువంటి అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ శాంతియుతంగా వ్యవహరించాలని కోరారు.

ఆంక్షలు అధిగమిస్తే కఠినచర్యలు తప్పవు..

కూనవరం :ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శించి నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ.శ్రీనివాస్ హెచ్చరించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అన్ని రాజకీయ పార్టీలు సమన్వయం పాటించాలని సూచించారు. బాణాసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. నిబందనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో విడిగా పెట్రోల్ విక్రయించరాదని సూచించారు.



చేపడుతున్న రోడ్డు పనులు

సిపిఎం పోరాట ఫలితంగా
ముమ్మరంగా రోడ్డు పనులు

ప్రజాశక్తి -అనంతగిరి:సిపిఎం పోరాట ఫలితంగా స్పందించిన సంబంధిత అధికారులు రోడ్డు పనులను ముమ్మరంగా చేస్తున్నారు. రెండు మండలాల సరిహద్దు హుకుంపేట మండలం పట్టం పంచాయతీ మెయిన్ రోడ్డు నుండి అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ చీడివలస, పాటిపల్లి, బంకొండ గ్రామాలకు మెటల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. 2018, 21 సంవత్సరం మధ్యలో రింగ్ రోడ్డు పనులకు ప్రభుత్వం సుమారు కోటి 40 లక్షల నిధులను మంజూరు చేసింది. అధికారులు, కాంట్రాక్టులు కుమ్మక్కై సగం నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, అధికారులకు ఫిర్యాదులు చేయడంతో సంబదిత అధికార యంత్రాంగం దిగొచ్చి ఆ గ్రామాలకు మెటె ల్ రోడ్డు పనులు చురుగ్గా చేపడుతున్నారు.

'బలిమెల' నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు సోమవారం చిత్రకొండ ఒపిహెచ్ గెస్ట్ హౌస్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 ఏప్రిల్ నెలలో ఆంధ్ర తన వాటాగా 4.7937 టిఎంసిలు నీటిని వినియోగించుకోగా, ఒడిశా 9.1148 టిఎంసిలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు కట్టారు. దీని ప్రకారం ఏప్రిల్ నెలలో ఆంధ్ర కంటే ఒడిశా 6.0627 టిఎంసిల నీటిని అధికంగా వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. 2023 నుంచి 2024 ఏప్రిల్ నెల చివరి నాటికి ఆంధ్ర తన వాటా మొత్తం 59.1210 టిఎంసిలు నీటిని వినియోగించుకుందని, ఒడిశా 2024 ఏప్రిల్ నెల చివరి నాటికి 51.4259 టిఎంపిలు నీటిని వినియోగించుకున్నట్లు ఇరు రాష్ట్రాల అధికారులు లెక్కలు తేల్చారు. ఇప్పటివరకు ఒరిస్సా కంటే ఆంధ్ర 7.6951 అధికంగా వినియోగించుకున్నట్లు ఇరు రాష్ట్ర అధికారులు నిర్ధారించారు. బలిమెల, జ్వాలాపుట్ జలాశయాల23.4123 టిఎంసిల నీటి నిలువలు ఉన్నాయని, వీటిలో ఆంధ్ర వాటాగా 15.5537 టిఎంసిలు నీటిని పంపకాలు జరిపారు. బలిమెల, జోలాపుట్టు నది పరివాహక ప్రాంతాల్లో వర్షాకాలం సీజన్ ప్రారంభ అయ్యేంతవరకు ఉన్న నీటి నిలువలను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు భావించారు. ప్రస్తుతం విద్యుదుత్పత్తికి ఇరిగేషన్ నీటి అవసరాలకు బలిమెల జలాశయం నుంచి ఆంధ్రకు రెండు వేలు క్యూసెక్కులు, ఒరిస్సాకు 2500 క్యూసెక్కులు నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్ర అధికారులు అంగీకారం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో ఒడిశా పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కన్స్ట్రక్షన్ ఇంజనీర్ పితాబాస్ శెట్టి, ఎర్త్ డాం డివిజన్ సూపరింటెంట్ ఇంజనీర్ రమాకాంత పాత్ర, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తుసార్ రంజన్, కుంతియా ఎఇలులు గంగాధర్ ప్రధాన్, కెసి.ఫణి, బలిమెల హైడ్రో పవర్ కార్పొరేషన్ అధికారులు ఎ. శివప్రసాద్ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయదాస్, ఆంధ్ర తరపున ఎస్ఇ కెకెవి. ప్రశాంత్‌కుమార్, ఇఇ ప్రభాకర్, డిఇఇ వెంకట మధు, ఎఇ సిహెచ్ సురేష్ పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు

ఘనంగా భీముడు పండగ

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని బి.తాడేపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో సోమవారం భీముడు పండుగ (కొండదోసం)ను ఘనంగా నిర్వహించారు. గిరిజన సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే పండగల్లో భీముడు పండుగ (కొండదోసం)చాలా ప్రాముఖ్యమైంది. ఈ పండుగ చేయడంతో వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండుతాయని గిరిజనుల నమ్మకం.

సమయపాలన పాటించకుంటే చర్యలు

ప్రజాశక్తి-వడ్డాది:వేసవి సెలవుల్లో అంగన్వాడీలు సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌జెడి చిన్మయదేవి హెచ్చరించారు. బుచ్చయ్యపేట మండలం మంగళవారం, కుముందాను పేట అంగన్వాడి కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా చేశారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై ఆరా తీశారు. చిన్నారులకు మెనూ తప్పకుండా అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా పిల్లలపై తగిన జాగ్రత్తలు వహించి తల్లిదండ్రులు అంగన్వాడి కేంద్రాలకు పంపాలని తెలిపారు.

సభలు, సమావేశాలు నిర్వహించొద్దు

ప్రజాశక్తి -నక్కపల్లి :ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామాల్లో సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ వద్దని సీఐ విజయ్ కుమార్ సూచించారు. మండలంలోని వేంపాడు, చినదొడ్డిగల్లు గ్రామాల్లో సోమవారం రాత్రి సమావేశాలు నిర్వహించారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా ప్రజలు నడుచుకోవాలన్నారు. 144 సెక్షన్ , అదేవిధంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ప్రజలు రచ్చబండ, పాన్ షాపులు, టి దుకాణాల వద్ద గుమిగూడి ఉండరాదని తెలిపారు. అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడటం చట్టరీత్యా నేరమన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కేసులు తప్పవన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- నక్కపల్లి:వైకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ బోడపాటి దివినమ్మకు తోటి ఉద్యోగులు ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు.కమ్యూనిటీ కోఆర్డినేటర్ గా పని చేస్తున్న దివినమ్మ ఈనెల 10న బైక్ పై విధులకు వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. 6 నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జేఏసీ యూనియన్ తరపున ఉద్యోగులు రూ.70 వేలు సమకూర్చి సోమవారం డిఆర్‌డిఏ పిడి శచీదేవి, ఏపీడి చేతుల మీదుగా గాయపడ్డ దివినమ్మ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు, వైకెపి సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మండలంలో 11 రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అప్పారావు తెలిపారు. 50 శాతం సబ్సిడిపై విత్తనాలు ఇస్తున్నామని చెప్పారు. జనుము 10కేజీలకు గాను పూర్తి ధర రూ.880కాగా సబ్సిడి రూ.440 పోను 440 రైతు చెల్లించాలన్నారు. జీలుగ 10 కేజీలు రూ.800 గాను రూ.400 సబ్సిడి గాను రూ.400 రైతు వాటా చెల్లించాలని చెప్పారు. పిల్లిపెసర ఎనిమిది కిలోలకు గాను రూ.1072 కాగా రూ.536 సబిడ్సి పోను రూ.536 రైతు వాటా చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రం వద్ద ఆధార్, భూమి పాసు పుస్తకం, ఫోన్ నెంబర్ తీసుకోవాలని చెప్పారు.

ఎపిఆర్‌డిసిలో సత్తా చాటిన విద్యార్థి

ప్రజాశక్తి -కోటవురట్ల:ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఏపీఆర్‌డిసి ఎంట్రన్స్ పరీక్షల్లో కోటవురట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆర్.హర్షవర్ధన్ దేవిశ్రీప్రసాద్ రాష్ట్రస్థాయిలో 29వ స్థానం సాధించాడు. నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో b.com సీటు సాధించాడు. ఈ మేరకు హర్షవర్ధన్ ను కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, సిబ్బంది అభినందించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:ఎన్నికల ప్రక్రియ దాదాపుగా ముగియడంతో అధికారులు కార్యాలయాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసిల్దార్ వెంకటరమణ సూచించారు. సోమవారం ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. పెండింగ్లో ఉన్న రెవెన్యూ దరఖాస్తులు, విద్యార్థులకు సంబంధించిన దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: వర్షాకాల సీజన్ ప్రారంభం కానుండటంతో మూగజీవులకు వ్యాధులు సోకే అవకాశం ఉందని, పశువైద్య శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ ఏడి రాజారావు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పశు వైద్య శాఖ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు.పశు వైద్య శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కుంచుమండ, దుమ్మిబిగూడ పశు వైద్య సిబ్బందితో పాటు రైతు భరోసా కేంద్రాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏహెచ్ఏలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. మూగజీవులకు వెంటనే వైద్య సేవలు అందించడానికి సరిపడా మందులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు కూడా దీన్ని గమనించి మూగజీవులకు ఎటువంటి వ్యాధులు సోకిన వెంటనే స్థానిక పశువైద్య సిబ్బందికి సమాచారం అందించి వైద్య సేవలు చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ ఎస్ సుబ్బారావు, ఏహెచ్ఏలు ఎస్.త్రినాధరావు, జయరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ రాజారావు

దరఖాస్తు చేసిన విద్యార్థులందరికీ...

ఇంటర్ ప్రవేశాలు కల్పించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా పాడేరు మండల కేంద్రంలో ఏపీ ఆర్ గురుకుల బాలికల కళాశాలలో మే 21, 22 తేదీలలో నిర్వహించే కౌన్సిలింగ్‌లో 2024 ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ప్రవేశం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు కే ప్రభుదాస్ అధికారులను కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ విషయంపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ప్రతి అభ్యర్థికి అడ్మిషన్ కల్పించే విధంగా చేయాలని కోరారు. ఏజెన్సీ 11 మండలాలలో 8 గురుకుల కళాశాలలు ఉన్నాయని, కొన్ని కళాశాలలో వసతి గృహాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కళాశాలలో తరగతులు ప్రారంభించే నాటికి మౌలిక సౌకర్యాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు కోరుకున్న గ్రూపులకు సీట్లు కేటాయించాలని కోరారు. గతంలో ఒక గ్రూపుకి అప్లై చేసుకుంటే వేరే గ్రూప్ సీటు ఇచ్చి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్ల కల్పనలో కాలయాపన చేయవద్దని, మొదటి కౌన్సిలింగ్‌లోనే అందరికీ సీట్లు సర్దుబాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాపారావు, మహేష్ పాల్గొన్నారు.

సత్తిబాబు ఆశయ సాధనకు కృషి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక కృష్ణ ప్యాలెస్‌లో కార్మిక నాయకులు డి.సత్తిబాబు ప్రథమ వర్ధంతిని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు అడిగర్ల రాజు అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్మిక నాయకులు సత్తిబాబు చిత్రపటానికి స్థానిక మున్సిపల్ కార్మికులు, ఆశ వర్కర్లు అంగన్వాడి వర్కర్లు, ముఠా, భవన నిర్మాణ కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ మాట్లాడుతూ, ప్రజల గుండెల్లో సత్తిబాబు చిరస్మరణీయుడన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆయన చేసిన సేవలు మరువలేవని కొనియాడారు. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ ఆయన పోరాటాలు నిర్వహించే వారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అండగా నిలిచే పార్టీ సిపిఎం అని, మనమందరం ఉండటం చాలా ఆనందించదగ్గ విషయమన్నారు. రాజకీయ నేతలు పదవులు ఆశించి రాజకీయాలు చేస్తారని, అందుకు భిన్నంగా సత్తిబాబు పోరాటాలు చేసి నర్సీపట్నం తదితర ప్రాంతాల్లో కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ప్రజల సమస్యలపై నిరంతర కృషి చేశారన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను హరించి, నల్ల చట్టాలు తెచ్చిందని విమర్శించారు. నిత్యవసర ధరల పెరుగుదలకు బిజెపి కారణమని దుయ్యబట్టారు. పోరాటాలు చేసి కార్మికులకు అండగా సిపిఎం నిలుస్తుందని తెలిపారు.

ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘ నాయకులు దలే సత్యనారాయణ మాట్లాడుతూ, సత్తిబాబు ఎప్పుడూ ప్రజల గుండెల్లో నిలుస్తారన్నారు. ఆయనకు తాను మిత్రుడుగా ఉండటం నా అదృష్టమన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, నిరాడంబరంగా జీవిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి సత్తిబాబు అని కొనియాడారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసమే పోరాటాలు చేశారన్నారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదను లూటీ చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సత్తిబాబు మిత్రుడు, లాయర్ ప్రకాష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు, గిరిజన ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ధనార్జన్, జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు త్రిమూర్తులు రెడ్డి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ ప్రాజెక్టు ఇన్చార్జ్ మహాలక్ష్మి, బొట్టా నాగరాజు, మురళి మాస్టర్, ఐద్వా జిల్లా నాయకురాలు సూర్యప్రభ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

నక్కపల్లి:విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం చేయడంతో మేధస్సు పెంపొందుతుందని చరిత్ర అధ్యాపకులు నాగేశ్వరరావు తెలిపారు. నక్కపల్లి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు రామాయణం, మహాభారతం, సనాతన భారతీయ ధర్మంపై బోధించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు పాల్గొన్నారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాల యాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్ రీడింగ్, నీతి కథలు చెప్పడం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాధికారి రాజుబాబు మాట్లాడుతూ, విదార్థులు ఈ వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట:స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. సోమవారం విద్యార్థులతో చదరంగం కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీల్లో 15 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. వేసవి సెలవుల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వెంకటలక్ష్మి కోరారు.

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. రీసోర్స్ పర్సన్ కృష్ణవేణి ఆంగ్ల భాషలో మెలకువలు వివరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులరెడ్డి గురజాడ అప్పారావు రాసిన దేశమును ప్రేమించుమన్న గీతాన్ని పాడించి, అర్థాన్ని వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ నిజాయితీ కథను తెలియజేశారు. రిక్రియేషన్ ఆటలు ఆడించారు. విద్యార్థులకు ప్రతిరోజు స్నాక్స్ ఇస్తున్నారు.

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ..
శాంతియుతంగా ఉండకుంటే చర్యలు

ప్రజాశక్తి-కొత్తకోట:ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ శాంతి యుతంగా ఉండాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 13న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎన్నికల పోలింగ్ సందర్భంగా జరిగిన చిన్న పాటి ఘర్షణలలో ప్రమేయం ఉన్న యువకులు, నాయకులకు సీఐ సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆ రోజు పోలింగ్ కేంద్రం వద్ద కొంత మంది యువకులు పరస్పరం దూషణలకు దిగారని, దీన్ని వీడియో రికార్డు చేశామని పేర్కొన్నారు.ఎన్నికల విధులలో పోలీసుల సేవలకు ఆటంకం కల్గించినా వివాదాలు సృష్టించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. అనవసరంగా జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. జూన్ 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ సమయంలో శాంతియుతంగా మెలగాలని సూచించా రు. అనంతరం వారి వద్ద లిఖిత పూర్వక హామీ తీసుకున్నారు.ముందస్తు చర్య గా వారందరినీ బైండోవర్ చేశామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట ఎస్ఐ లక్షణరావు తదితరులు పాల్గొన్నారు...

మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహం పక్కనే ఉన్న శ్రీమైత్రి ఐ కేర్ ఆప్టికల్ షాపు వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ (అనకాపల్లి), శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా 30 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మైత్రి ఐ కేర్ ఆప్టికల్ డాక్టర్ రాజా శేఖర్, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ దుర్గ భవాని, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ అశ్వని కుమార్, నర్సింగ్ స్టాఫ్ శిరీష పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : ఈ ఏడాది ఖరీఫ్ పంటకు రైతులకు సకాలంలో వరి విత్తనాలు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని మార్క్‌ఫెడ్ ఎమ్‌డి శ్రీధర్ బాబు అన్నారు. మండలంలోని మద్ది గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఆధునిక యంత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఆధునిక యంత్రాల ద్వారానే వ్యవసాయం సులభతరంగా చేసుకోవచ్చని చెప్పారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పర్యావరణాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డిఎస్‌ఎన్‌ఎల్‌యు ఫస్ట్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. మానవ హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. సోమవారం రామ్‌నగర్‌లోని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా జిల్లా అధికార యంత్రాంగంతో పాటు జివిఎంసి, పలు ఫార్మా, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణపై ప్రజల్లోకి అవగాహన కల్పిస్తున్నామన్నారు. మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం విశాఖ నగరంలోని పోర్టు, స్టీల్‌ప్లాంట్, ఇతర ఫార్మా కంపెనీల కారణంగా పర్యావరణం కాలుష్యంతో నిండిపోతోందని, ఈ నేపథ్యంలో ప్రతి ప్రాంతంలోని సహజ వనరులైన గెడ్డలు, కాలువలు తదితర వాటిని కాపాడుకోవాలని అన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పక్కగా అమలు చేసే క్రమంలోనే మానవ హక్కుల కౌన్సిల్ కూడా భాగస్వామ్యం అయి ప్రజా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ, గాంధీయన్ విద్యా కేంద్రం డైరక్టర్ ప్రొఫెసర్ సీతామాణిక్యం పలు అంశాలను స్వచ్ఛ భారత్ అనుభవంతో రూపొందించారన్నారు. దశల వారీగా చేపట్టే ఈ అవగాహన కార్యక్రమాలకు చెందిన పోస్టర్‌లను మానవ హక్కుల కౌన్సిల్ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎస్‌వి.రమణ, పైడిరాజు రెడ్డి, ఎన్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విస్కోలో అక్రమాలపై విచారణ జరపాలి

- సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఇండస్ట్రియల్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ (విస్కో)లో అక్రమాలపై విచారణ జరపాలని సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జివిఎంసి కమిషనర్‌కు సోమవారం ఓ లేఖ రాశారు. విస్కోలో అక్రమాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు తెలుస్తోందని అన్నారు. ఐఎఎస్ అధికారి భవనానికి గెస్ట్‌హౌస్ పేరిట రూ.20 లక్షల అద్దె చెల్లింపు, వాహనాలు కొనుగోలు, కాంట్రాక్టుల నుంచి కమిషన్లు, కాలువల నిర్వహణలో అక్రమాలు, జి.20 సదస్సు సందర్భంగా పచ్చదనం, సుందరీకరణ పనులకు నిబంధనలకు విరుద్ధంగా నిధులు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోందన్నారు. విస్కో ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన ఉద్యోగిపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విస్కోపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని కమిషనర్‌ను కోరారు. విచారణ రిపోర్టును కౌన్సిల్ సమావేశంలో చర్చకు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ముడసర్లోవలో నూతనంగా నిర్మించ తలపెట్టిన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కూడా 50 శాతం విస్కోకి భాగస్వామ్యం కల్పించారని, దీనిని కౌన్సిల్ సమావేశంలో సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించిందని తెలిపారు. ఈ కేటాయింపులో పెద్దఎత్తున రాజకీయ అవినీతి కుట్ర ఉన్నదని సిపిఎం భావిస్తోందన్నారు. జివిఎంసి ఆస్తులను చట్ట విరుద్ధంగా విస్కోకి బదిలీ చేసి ఆస్తులపై ప్రైవేటు వ్యక్తులు అజామాయిషీ, వ్యాపార లావాదేవీలు చేసుకోవడానికి ఈ కుట్ర పన్నినట్లు తెలుస్తోందన్నారు. త్వరలో విస్కోని ఒక రాజకీయ నాయకుడి బినామీకి కట్టబెట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని కోరారు.

రంపచోడవరంలో వర్షం

ప్రజాశక్తి- రంపచోడవరం : మండలంలో సోమవారం మధ్యాహ్నం ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయగా, మధ్యాహ్నానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి కుండపోతగా భారీ వర్షం కురిసింది. ఎదురెదురుగా వచ్చినా కనబడనంత విస్తారంగా వర్షం కురవడంతో ఆ కొద్దిసేపైనా వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వచ్చింది. కుండపోత వర్షంతో రోడ్లన్నీ వర్షపు నీటితో జలమయ మయ్యాయి. ఇటీవల ఇంత భారీ వర్షం కురిసిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు.

ఈదురుగాలులతో నేలకొరిగిన వృక్షాలు

చింతూరు : మండలంలోని చట్టి, ఎర్రంపేట గ్రామాలలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది.గాలి దుమారానికి ఎర్రంపేటలో రహదారిపై పెద్ద చెట్లు విరిగి అడ్డంగా పడ్డాయి. చట్టి గ్రామంలో కూడా విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుతు సరఫరాకు అంతరాయం కలిగింది. రహదారులపై విరిగిపడిన చెట్లను తొలగించిన సంబంధిత అధికారులు, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. గతవారమే ఎపిఇపిడిసిఎల్ డివిజన్ స్థాయిలో సంబంధిత అధికారులు, సిబ్బంది విద్యుత్తు లైన్ల, నిర్వహణ, మరమ్మతులు, లైన్లపై ఉన్న చెట్ల తొలగింపు వంటి చర్యలు ముందుస్తుగానే చేపట్టడంతో పెద్ద ఇబ్బంది కలగలేదని అంటున్నారు.


రంపచోడవరంలో కురుస్తున్న జోరువాన


జలమయమైన జనావాసాలు

పురోగతిలేని పనులు

రెండో దశ నాడు - నేడుకు నిధుల కొరత
జూన్ 1న జూనియర్ కళాశాలల పున:ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పున:ప్రారంభించే నాటికి నాడు - నేడు కింద చేపట్టిన పనులు పూర్తయ్యే అవకాశాలు కనుచూపుమేర కనబడ్డంలేదు. ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో విడుదలకాక, విడుదల చేసిన కొద్ది రోజులకు ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనుల్లో పురోగతి పెద్దగా లేదు. జూన్ ఒకటి నుంచి కళాశాలలు ప్రారంభంకానున్నాయి. గడువు చాలా తక్కువ వుండడంతో యుద్ధప్రాతిపదికన నిర్మాణ, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేసినా పూర్తయ్యే పరిస్థితి కానరావడం లేదు.

జిల్లాలో 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఆ కళాశాలల్లో రెండో దశ నాడు-నేడు కింద 180 రకాల పనులు చేపట్టేందుకు రూ.15.48 కోట్లును ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో ప్రధానంగా కళాశాలల మరమ్మతులు, సురక్షిత నీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణ పనులు సహా పలు రకాల పనులు చేపట్టాల్సివుంది. రూ.15.48 కోట్లకు గతేడాది మార్చి నాటికి రూ.7.8 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. దీంట్లో రూ.6.51 కోట్లు పనులు చేసే వారికి బిల్లులు చెల్లించారు. సాంకేతిక కారణాలతో కోటిన్నర రూపాయల వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. గత డిసెంబరు నాటికి పనులన్నీ పూర్తిచేయాలని అనుకున్నా ఆశించినట్లు జరగలేదు. తరువాత ఇంటర్ పరీక్షలు జరగడం, బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో పనులు పెద్దగా ముందుకుసాగలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి నిర్మాణ పనులకు సరిపడా ప్రభుత్వం నిధులు విడుదల చేసినా అంతలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది. పోలింగ్ అయ్యాక పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో కళాశాల విద్యార్థులు పాత సమస్యల మధ్య చదువును కొనసాగించాల్సి వస్తోంది.


కె.కోటపాడు జూనియర్ కళాశాలలో నిలిచిన మరుగుదొడ్ల పనులు

28న ప్రజా పంపిణీ బియ్యం వేలం

ప్రజాశక్తి -చింతూరు. : స్థానిక జిసిసి గోదాములో ఉన్న 10,770 టన్నుల ప్రజా పంపిణీ బియ్యాన్ని ఈనెల 28న మధ్యాహ్నం 3 గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్ద బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నజీముల్లా షా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తికర ట్రేడర్లు 27న సాయంత్రం ఐదు గంటల లోపు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తోట త్రిమూర్తులును అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల జరిగిన ఎన్నికలలో మండపేట వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన తోట త్రిమూర్తులు వల్లూరులోని దళిత మహిళా గ్రామ సర్పంచ్ దాసి మీనా కుమారిని కులం పేరుతో దూషించి దాడికి పాల్పడిన సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేసిందని భారత నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు తెలిపారు. ఫిర్యాదుపై అంగర పోలీస్ స్టేషన్‌లో త్రిమూర్తులు, అతని కుమారునిపైన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదైందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇరువురినీ తక్షణం అరెస్టు చేయాలని సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంకటాయపాలెంలో ఇరువురు దళితులకు 1996 డిసెంబర్ 26న శిరోముండనం చేయించి, హింసించిన ఘటనపై తోట త్రిమూర్తులకు విశాఖలోని ప్రత్యేక కోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 16న జైలు శిక్ష విధించిందని, ప్రస్తుతం తోట త్రిమూర్తులు బెయిలుపై ఉండి కూడా దళిత మహిళపై దాడి చేసినందున, ఎఫ్ఐఆర్ నమోదు అయినందున బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. దళితులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

జగదాంబ జంక్షన్
అభివృద్ధి పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్-4లోగల జగదాంబ జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం ఆయన జగదాంబ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్‌ను పరిశీలించి సుందరీకరణ పనులకు తగు సూచనలను పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్‌కు అందజేశారు. నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం లేపాక్షి జంక్షన్ వద్ద కాలువ నిర్మాణ పనులను పరిశీలించి సర్కిల్ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని, రోడ్డు, సెంటర్ మీడియన్ పనులను వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ రాజును కమిషనర్ ఆదేశించారు.